సాక్షి కామారెడ్డి

బుధవారం ౹ 24 ౹ జూలై ౹ 2024



బస్సులు నడపాలి

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు ధర్నా చేశారు.

- IIలో ▸



కార్మికుల కోసం..

కార్మికుల సంక్షేమం కోసం బీఎంఎస్ పనిచేస్తోందని సంఘం రాష్ట్ర కన్వీనర్ పేర్కొన్నారు.

- IIIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /23.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు న్నాయి.

న్యూస్‌రీల్

'మెరుగైన సేవలు అందించడానికి చర్యలు'

కామారెడ్డి అర్బన్: వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కామారెడ్డి సర్కిల్ పరిధిలో 2 ఎంవీఏ సామర్థ్యం గల 18 కెపాసిటర్ బ్యాంకులు బిగించినట్లు ఎస్ఈ రమేశ్ బాబు తెలిపారు. ఓల్టేజీలో హెచ్చుతగ్గులు లేకుండా ఉండడానికి మరో 9 కెపాసిటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే 11 కేవీ లైన్లలో 600 కేవీఏఆర్ కెపాసిటర్లు అమర్చనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గి మోటార్లు కాలిపోకుండా ఉంటాయని పేర్కొన్నారు. పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు సొంతంగా కెపాసిటర్లు పెట్టుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

'ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి'




భిక్కనూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధుశర్మ సూచించారు. మంగళవారం భిక్కనూరు పోలీస్ సర్కిల్ కార్యాలయంతోపాటు పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆమె వెంట సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్ ఉన్నారు.

పంటల పరిశీలన



బాన్సువాడ : బీర్కూర్ మండలం సంబాపూర్‌లోని పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు చేసిన పంటలు, చీడపీడల వ్యాప్తి గురించి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారి కమలతో మాట్లాడి పంటల నమోదు ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. అనంతరం బైరాపూర్, బీర్కూర్, దామరంచ, రైతునగర్‌లలోని గ్రోమోర్ దుకాణాలను సందర్శించి, స్టాక్ వివరాలు సేకరించారు. ఆమె వెంట ఏఈవోలు శ్రావణ్, కావ్యశ్రీ, రైతులు పోశెట్టి, కృష్ణ ఉన్నారు.

బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడి మృతి



సుభాష్‌నగర్ : బీజేపీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు కాట్‌పల్లి రామ్‌గోపాల్‌రెడ్డి (75) మృతి చెందారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న రాంగోపాల్‌రెడ్డి సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్‌కు చెందిన రామ్‌గోపాల్‌రెడ్డి 1991–93 వరకు నిజామాబాద్ నగర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

28న ఊర పండుగ



నిజామాబాద్ అర్బన్ : సర్వసమాజ్ కమిటీ నిర్ణయం మేరకు ఈనెల 28న నగరంలో ఊర పండుగ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం గాజులపేట్‌కు చెందిన శ్రీ విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం అధ్వర్యంలో బండారు పోశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సర్వసమాజ్ కమిటీ కో కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడు సుంకటి ప్రవీణ్, పట్లే వెంకటరమణ, పాలంచ గంగాధర్, కోరడి గోపి, భైర గంగ శైలేందర్, నర్సయ్య, కోర్వ భూపాల్, భైర గంగ ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు నిరాశే!

- కేంద్ర బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యత
- ఊసేలేని కొత్త రైల్వే లైన్లు
- ముద్ర రుణాల పెంపుతో చిరు వ్యాపారులకు మేలు
- ఉన్నత విద్యకు చేయూత.. రూ.10 లక్షల రుణ సాయంపై విద్యార్థుల్లో హర్షం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. జిల్లాకు ప్రత్యేకించి ఎలాంటి ప్రయోజనాలు కలగకపోవడంతో పెదవి విరుస్తున్నారు. ప్రధానంగా కొత్త రైల్వే లైన్లకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం జిల్లావాసులను నిరాశపరిచింది. ముద్ర రుణాల పెంపు, ఉన్నత విద్యకు చేయూత, బంగారంపై పన్ను తగ్గింపు వంటి అంశాలు ఊరటనిచ్చాయి.



సాక్షి, కామారెడ్డి : కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా జిల్లామీదుగా కొత్త రైల్వే లైన్‌కు మోక్షం లభిస్తుందని ఆశించారు. దశాబ్దాలుగా బోధన్ -బాన్సువాడ -బీదర్ రైల్వే లైన్ అంశం పెండింగ్‌లోనే ఉంటోంది. ఈసారీ ఈ లైన్‌కు మోక్షం లభించలేదు. జిల్లా కేంద్రాన్ని రెండుగా విభజించే రైల్వే లైన్‌పై వంతెనల నిర్మాణాలు చేపట్టాలన్నది డిమాండ్‌గానే ఉండిపోయింది. కరీంనగర్ నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు జాతీయ రహదారినీ కేంద్రం పట్టించుకోలేదు. పాత పెన్షన్ విధానంపై ఊరట కలిగించే అంశం కేంద్ర బడ్జెట్‌లో లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు నిరాశ చెందారు. విద్యారంగానికి కేటాయింపులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని విద్యావేత్తలు అంటున్నారు. గృహ విద్యుత్ అవసరాల కోసం 3 వందల యూనిట్ల వరకు ఉచితంగా పొందడానికి అవసరమైన సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. సౌర విద్యుత్తును వాడుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని చెబుతోంది.

పేద విద్యార్థులకు వరం..

దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు రూ.10 లక్షల వరకు రుణం ఇవ్వడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఉన్నత చదువులు ఆర్థికంగా భారంగా మారిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో విద్యా రుణాలు ఎంతగానో ఉపయోగపడుతాయని భావిస్తున్నారు.

ముద్ర రుణం రూ.20 లక్షలకు పెంపు..

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునేవారికి ఎటువంటి పూచీకత్తు లేకుండా అందించే ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షలనుంచి రూ.20 లక్షలకు పెంచారు. ఇది చిరు వ్యాపారులకు ఎంతగానో మేలు చేస్తుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలో వందలాది మందికి ప్రయోజనం కలుగనుంది. అయితే ముద్ర రుణాలపై అవగాహన లేకపోవడంతో చాలా మంది ఈ పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

మహిళలకు ప్రాధాన్యత

బడ్జెట్‌లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారు. మహిళల పేరిట ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాంప్ డ్యూటీ తగ్గించడం, బంగారం, వెండి ధరలపై సుంకం తగ్గించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

బాగుంది



సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచడం బాగుంది. అయితే దీనిపై ప్రజలకు అవగాహన లేదు. అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలి. బంగారంపై పన్ను తగ్గించడం సంతోషాన్నిచింది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని పెంచి ఉంటే బాగుండేది.

– పార్శి కాంశెట్టి, ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్, చాంబర్ ఆఫ్ కామర్స్, కామారెడ్డి

విద్యకు 2.59 శాతం నిధులే



వికసిత్ భారత్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. విద్యారంగానికి రూ.1.25 లక్షల కోట్లే కేటాయించారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 2.59 శాతం మాత్రమే. విద్యకు కనీసం 6 శాతం కేటాయిస్తే విద్యాసంస్థలలో మౌలిక వసతులు, కొత్త ఉపాధ్యాయుల నియామకం జరిగే అవకాశం ఉండేది.

– వేణుగోపాల్, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, కామారెడ్డి

తెలంగాణకు అన్యాయం



బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది. ఏపీ, బీహార్‌లకు ప్రకటించిన దాంట్లో 25 శాతం కూడా తెలంగాణకు ప్రకటించలేదు. మహిళల భద్రత ఊసేలేదు. ధరలను నియంత్రించే చర్యలేవీ చేపట్టలేదు. నిధుల కోసం ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా, వాటిని పట్టించుకోలేదు.

– షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారు

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం..



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యంగా ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేవారికి రూ. 10 లక్షల వరకు లోన్ తీసుకునే అవకాశం కల్పించారు. ముద్ర రుణాలను రూ.20లక్షలకు పెంచడంతో చాలామందికి మేలు జరుగుతుంది.

– వెంకటేశం, విశ్రాంత బ్యాంకు మేనేజర్, కామారెడ్డి

రాష్ట్రాన్ని పట్టించుకోలేదు



బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటాయింపులు చేశారు. తెలంగాణను పట్టించుకోలేదు. రైతే రాజు, యువతకు ఉపాధి అవకాశాలు అంటున్నా వాస్తవంగా ఎంతమందికి అవకాశాలు లభిస్తాయనేది చూడాలి. బాలికలు, మహిళల అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్‌ను సరిగా అమలు చేయాలి.

– నంగునూరి లత, అధ్యక్షురాలు, తెలంగాణ ఇండిపెండెంట్ ఫోరం

నిజాంసాగర్‌లోకి 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,387.98 అడుగుల(3.286 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ నీటిమట్టం నిలకడగా ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 416.5 మీటర్లకుగాను ప్రస్తుతం 415.8 మీటర్ల నీరుంది.

'రుణమాఫీ సొమ్ము రైతులకే ఇవ్వాలి'

కామారెడ్డి క్రైం: అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల పేరిట తీసుకున్న క్రాప్‌లోన్లు మాఫీ అయ్యాయని, ఆ డబ్బులు రైతులకే ఇవ్వాలని సదాశివనగర్ మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ విషయమై ఓ ప్రకటన విడుదల చేశారు. గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు తెలియకుండానే వారి పేర్లపై క్రాప్ లోన్ తీసుకుందని ఆరోపించారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో తమ రుణం మాఫీ అయినట్లు రైతులకు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. అడ్లూరు ఎల్లారెడ్డి, పోసానిపేట్, సదాశివనగర్, మర్కల్, కుప్రియాల్ గ్రామాల రైతుల పేరుతో ఫ్యాక్టరీ యాజమాన్యం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడ యూనియన్ బ్యాంకులో రుణం పొందినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే మాఫీ అయిన డబ్బులను రైతులకు చెల్లించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

భోజనంలో బొద్దింక

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- మారని తెయూ హాస్టల్ తీరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్ అధికారులు, సిబ్బంది తీరు మారడం లేదు. శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో వర్సిటీ న్యూ బాయ్స్ హాస్టల్‌లో గుడ్డుకూరలో బొద్దింక వచ్చింది. వెంటనే ఈ విషయాన్ని కేర్‌టేకర్ దృష్టికి తీసుకెళ్లగా కూరలో వచ్చి ఉండదని, భోజనం చేస్తున్న సమయంలో పైనుంచి పడి ఉంటుందని సర్ది చెప్పడంతో విద్యార్థి మిన్నకుండిపోయాడు. అయితే మంగళవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతనెల 21న బాలికల హాస్టల్‌లో అల్పాహారంలో బల్లి రావడం, ఈనెల 18న అదే హాస్టల్ భోజనంలో పురుగు రావడం మరవక ముందే మళ్లీ న్యూ బాయ్స్ హాస్టల్‌లో బొద్దింక రావడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భోజనంలో పురుగులు వస్తున్నా చీఫ్ వార్డెన్, వార్డెన్‌లు, కేర్‌టేకర్‌లు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. హాస్టల్స్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా రిజిస్ట్రార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ యాదగిరిని సంప్రదించగా మంగళవారం న్యూబాయ్స్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్లు తెలిపారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు ఎవరూ కూడా బొద్దింక విషయమై తనకు చెప్పలేదన్నారు. గత నెలలో అల్పాహారంలో కీటకం వస్తే హెడ్ కుక్‌ను సస్పెండ్ చేశామన్నారు. కొందరు పనిగట్టుకుని వర్సిటీ పరువుకు భంగం కలిగించేలా విద్యార్థులతో ఇదంతా చేయిస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



భోజనంలో వచ్చిన బొద్దింక

నాణ్యమైన భోజనం అందించాలి

తెయూ(డిచ్‌పల్లి) : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు. తెయూ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్ హాస్టల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, మెస్ హాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిసరాలతో పాటు వంటగది, మెస్ హాల్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ఏఈ వినోద్, చీఫ్ వార్డెన్ మహేందర్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్ వర్ధన్‌రెడ్డి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారి వెంట కేర్ టేకర్స్ క్రాంతి కుమార్, దిగంబర్ చౌహాన్, రమేశ్ ఉన్నారు.

గాంధారిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



లొంక తండా వద్ద కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్



గాంధారి కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం గాంధారి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మొదట గాంధారి పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ గురించి తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ప్రారంభించబోయే మహిళా క్యాంటీన్, బస్టాండ్ ఆవరణతో పాటు మరుగుదొడ్లను పరిశీలించారు. ఆవరణలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని, మట్టి కుప్పలను చదును చేయించాలని అధికారులను ఆదేశించారు. అప్పటివరకు ప్రయాణికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోని ఆర్టీసీ అధికారులు.. కలెక్టర్ ఆదేశాలతో వెంటనే రంగంలోకి దిగారు. పొక్లెయిన్‌తో మట్టికుప్పలను తొలగించి చదును చేశారు. నిలిచిన నీటిని తొలగించారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికతోపాటు స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని గుట్టపై మొక్కలు నాటారు. అనంతరం లొంక తండాను సందర్శించి తండా సమీపంలో ఉన్న వాగులో కొట్టుకుపోయిన లోలెవల్ కల్వర్టును పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉన్నత పాఠశాలలో..

మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండడంతో వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో చందర్ నాయక్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, సీడీపీవో సరిత, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

బ్లాక్ స్పాట్‌లను గుర్తించండి

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, అలాంటి ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై నివేదించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలీస్, ఆర్అండ్‌బీ, రవాణా శాఖలు, జాతీయ రహదారుల అధికారులతో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా రోడ్డు ఆక్రమణకు గురయితే గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం కారణంగానే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

- ఐదుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు
- నలుగురు కాంట్రాక్టర్ల ఈఎండీలు, బ్యాంకు గ్యారంటీల జప్తు
- తిరిగి టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్ట్‌లోకి...
- ప్రస్తుత అగ్రిమెంట్లు రద్దు



సాక్షి, కామారెడ్డి : మంజీర నది పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ మైనింగ్‌పై సర్కారు చర్యలు చేపట్టింది. ఐదుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంతోపాటు కాంట్రాక్టర్లు, పట్టాదారులపైనా చర్యలు తీసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని మంజీర నది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ విచారణకు ఆదేశించింది. మైనింగ్ శాఖ డీజీఎం ఎస్.ఎల్లయ్య ఆధ్వర్యంలో అధికారులు బిచ్కుంద, బీర్కూర్ మండలాల్లో మైనింగ్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను సందర్శించారు. ఇసుక అక్రమ కార్యకలాపాలపై నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించారు. సమగ్ర విచారణ అధికారి సిఫారసుల మేరకు బిచ్కుంద, బీర్కూర్ మండలాల్లో పనిచేస్తున ఐదుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎం.లక్ష్మణ్ (ఎస్ఆర్ఏ), సీహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి (ఎస్ఆర్ఏ), ఆర్.శ్రీకాంత్‌రెడ్డి (ఎస్ఆర్ఏ), జి.శ్రీధర్‌రెడ్డి (ఎస్ఆర్ఏ), పి.రాంరెడ్డి (ఎస్ఆర్ఏ)లను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని టీజీఎండీసీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంట్రాక్టర్లపైనా..

ఇసుక అక్రమ కార్యకలాపాలలో పాల్గొన్న కాంట్రాక్టర్లపైనా సర్కారు చర్యలు తీసుకుంది. కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, మెస్సర్స్ ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్ అండ్ మినరల్స్, మెస్సర్స్ సుధాకరా ఇన్‌ఫ్రాటెక్, మెస్సర్స్ సాయి దాక్స్ ఇంజినీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌లతో పాటు పట్టాదారులైన ఫర్హానా బేగం, అబ్దుల్ కరీంలకు సంబంధించి ఈఎండీలు, బ్యాంకు గ్యారంటీల మొత్తాన్ని టీజీఎండీసీ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం జప్తు చేశారు. ఇదే సమయంలో వారు తదుపరి ఇసుక టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న అగ్రిమెంట్లను రద్దు చేస్తున్నట్టు టీజీఎండీసీ అధికారులు ప్రకటించారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామశివారులో పోచారం ప్రధానకాలువపై చేపట్టిన వంతెన నిర్మాణాన్ని మంగళవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా నిర్మించాల్సిన సైడ్‌వాల్స్ కోసం ఆయన కొలతలు వేశారు. కొలతల ప్రకారం సైడ్‌వాల్స్ నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను డీఈఈ ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయించాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి ఉన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన విద్యనందించాలి



నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం అన్ని విభాగాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, యుడైస్‌ క్రమబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్‌ నియంత్రణ కమిటీల ఏర్పాటు చేయాలని, పాఠ్యపుస్తకాలు, దుస్తులు సకాలంలో విద్యార్థులకు అందించి విద్య బోధన సక్రమంగా జరిగేలా చూడాలని, ఏకో క్లబ్స్‌, వన మహోత్సవం, పరిశుభ్రత, శిక్షసప్త, మధ్యాహ్న భోజనం పకడ్బందీగా ఉండాలన్నారు. టీచర్ల కొరత, ఇతర సమస్యల ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల భవనాలకు సంబంధించి మరమ్మతుల వివరాలను తెలుపాలన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: నిరుద్యోగులకు ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈనెల 25వ తేదీన జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే లక్ష్మణ్‌కుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాకు మెడిపెస్‌ కంపెనీలో ఫార్మాసిస్ట్‌, జూనియర్‌ అసిస్టెంట్‌, ఆడిట్‌ అసిస్టెంట్‌ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పది, ఇంటర్‌, డిగ్రీ, డి ఫార్మసీ, ఎంఫార్మసీ అండ్‌ పీసీఐ పాసైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో వెంట తీసుకురావాలని సూచించారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని, మరిన్ని వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్‌, పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా కొనసాగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల, న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్‌ 6, 8, 7, 9, 10వ సెమిస్టర్‌, పీజీ 1, 3వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 71 మంది విద్యార్థులకుగాను 71 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 159 మందికి 148 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

డిగ్రీ వన్‌టైం చాన్స్‌ బ్యాక్‌లాగ్‌ 5, 6వ సెమిస్టర్‌ పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెయూ అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (నిజామాబాద్‌), ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ డిగ్రీ కాలేజీ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (ఆర్మూర్‌) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 48 విద్యార్థులకు గాను 47 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని, అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురూ గైర్హాజరయ్యారని తెలిపారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి



చిన్నమల్లారెడ్డి నుంచి కామారెడ్డి ఆర్టీసీ డిపో వరకు నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

కామారెడ్డి రూరల్‌: విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్‌ చేస్తూ చిన్న మల్లారెడ్డి గ్రామంలో విద్యార్థులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఆర్టీసీ బస్సులను ఆపి రోడ్డుపై బ్యాగులు అడ్డంగా పెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. గుండారం నుంచి వచ్చిన బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఎక్కేందుకు కనీసం చోటు ఉండడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్‌ చేశారు. సమస్య పరిష్కరించేంత వరకు ధర్నా విరమించేది లేదని స్పష్టం చేశారు. సమాచారం తెలుసుకున్న దేవునిపల్లి పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను సముదాయించి ఆందోళనను విరమింప చేశారు.

ఆర్టీసీ డిపో ఎదుట ఏబీవీపీ నేతల ధర్నా

చిన్నమల్లారెడ్డి గ్రామానికి సమయానికి బస్సులు రావడం లేదని, వచ్చిన బస్సులు క్రిక్కిరిసిపోతున్నాయని ఆరోపిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు కామారెడ్డి ఆర్టీసీ డిపో వరకు ర్యాలీగా వెళ్లి డిపో మేనేజర్‌ ఆఫీస్‌ కార్యాలయం ఎదుట ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్‌ రోహిత్‌ మాట్లాడారు. చిన్న మల్లారెడ్డి గ్రామానికి వచ్చే బస్సులు ముందే నిండిపోయి వస్తున్నాయని అన్నారు. దీంతో చిన్న మల్లారెడ్డి గ్రామ విద్యార్థులకు బస్సులో చోటు ఉండటం లేదన్నారు. ఈ విషయమై డీఎంకు విద్యార్థులు కాల్‌ చేసి మాట్లాడగా.. వారు స్పందించకపోవడంతో విద్యార్థులందరూ చిన్న మల్లారెడ్డి నుంచి కొత్త బస్టాండ్‌ డిపో వరకు ఐదు కిలోమీటర్లు వానలో నడుచుకుంటూ వచ్చారు. డిపో మేనేజర్‌ లేకపోవడంతో విద్యార్థులు అక్కడే ధర్నాకు కూర్చున్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా బస్సును ఎల్లుండి నుంచి అందుబాటులో ఉంచుతామని డీఎం హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించి బస్సు సమస్యలన్నిటిని పరిష్కరించాలని ఏబీవీపీ నేతలు కోరారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్‌ కన్వీనర్‌ ఖలీల్‌, జిల్లా నాయకులు అల్తాఫ్‌, నవీన్‌, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి

- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన ముదిరాజ్‌ సంఘం సభ్యులు



రాస్తారోకో చేస్తున్న ముదిరాజ్‌ సంఘం సభ్యులు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన పిట్ల రాజయ్య అనే కార్మికుడు సోమవారం గ్రామంలో మాజీ సర్పంచ్‌ నల్లపు శ్రీనివాస్‌కు చెందిన నూతన భవన నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్‌ షాక్‌తో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబానికి నల్లపు శ్రీనివాస్‌ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. మాజీ సర్పంచ్‌ ఇంట్లో కూలి పని చేస్తూ విద్యుత్‌ షాక్‌ తగిలి తన భర్త రాజయ్య మృతిచెందాడని, ఈ విషయం తమకు తెలియకుండానే మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని, ఫిర్యాదు చేస్తే పోలీసులు ఏ1గా మేస్త్రీ శంకర్‌ పేరు, ఏ2గా మాజీ సర్పంచ్‌ నల్లపు శ్రీనివాస్‌ పేరు రాశారని రాజయ్య భార్య లక్ష్మి ఆరోపించారు. దోమకొండ ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, బీబీపేట ఎస్సై ప్రభాకర్‌లు వారిని సముదాయించినా వినలేదు. నల్లపు శ్రీనివాస్‌ అక్కడికి వచ్చి ఆర్థిక సాయం ఇవ్వడానికి ఒప్పుకుంటేనే తాము రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్‌, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావులు వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ముదిరాజ్‌ సంఘం ప్రతినిధులతో పాటు పెరిక సంఘం ప్రతినిధులు, గ్రామానికి చెందిన పలువురు పెద్దల సమక్షంలో ఇరు వర్గాలను శాంతింపజేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనకు ఎవరూ బాధ్యులు కాదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వర్‌రావ్‌ తెలిపారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి



విద్యార్థులు, ఉపాధ్యాయులతో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు, పోలీస్‌ సిబ్బంది

కామారెడ్డి రూరల్‌: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌ రెడ్డి సూచించారు. మంగళవారం కామారెడ్డి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పిల్లల పుట్టిన రోజును పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యులు, సిబ్బందితో కలిసి కామారెడ్డి పట్టణంలోని గొల్లవాడ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలకు ఫర్నిచర్‌ను వితరణ చేశారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులకు రంగులు, విద్యార్థులకు అవసరమైన ఫ్లెక్సీలు, పిల్లలు నేలపై కూర్చోకుండా వారికి కావలసిన కుర్చీలను, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తాను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ఈ స్థాయికి వచ్చానని, మీరు కూడా చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈవో ఎల్లయ్య మాట్లాడుతూ.. ఇదేవిధంగా దాతలు ముందుకు వచ్చి పాఠశాలలకు కావలసిన సామగ్రిని కొంతవరకైనా సహాయం చేస్తే బాగుంటుందని అన్నారు. పోలీస్‌ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్‌ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సిట్టింగులకు అనుమతిస్తే కేసులే..!



భిక్కనూరు : దాబా హోటళ్లలో మద్యం సిట్టింగులకు అనుమతిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని భిక్కనూరు సీఐ సంపత్‌ కుమార్‌ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దాబా హోటల్‌ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయంలో దాబా యజమానులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి దాబా హోటల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదన్నారు ఎస్సై సాయి కుమార్‌ ఉన్నారు.

గృహహింస కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామానికి చెందిన గరిగె శ్రీకాంత్‌పై ఆయన భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు గృహహింస కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్‌ మంగళవారం తెలిపారు. శ్రీకాంత్‌కు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కృష్ణవేణితో మూడు నెలల క్రితం వివాహం జరిగిందని ఎస్సై వెల్లడించారు. కొద్ది రోజులుగా అదనపు కట్నం కోసం భర్త, అత్త మానవ్వ, మామ గోపాల్‌లు వేధిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై గృహహింస కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఆర్టీసీ బస్టాండ్‌ పరిశీలన



బస్టాండ్‌లో సౌకర్యాల గురించి ఆరా తీస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌ను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ గడ్డం ఇందు ప్రియ మంగళవారం పరిశీలించారు. సీఎం రేవంత్‌ రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. డిపో పరిధిలో ఉన్న బస్సుల వివరాలను డీఎం ఇందిరను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులను నడపాలని సూచించారు. డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసును కేటాయించాలన్నారు. బస్టాండ్‌ ఆవరణలో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం సక్రమంగా ఉండేలా చూడాలని డిపో మేనేజర్‌కు సూచించారు. ఆమె వెంట మున్సిపల్‌ కమిషనర్‌ సుజాత, కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, సలీం, అనూష, ప్రసన్న, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో విస్తారంగా వర్షం



కృష్ణాజీవాడిలోని సోయా పంటలో చేరిన నీరు



గోజేగావ్‌ సమీపంలోని లెండివాగులో వరద నీరు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో నాలుగు రోజుల నుంచి ఎడ తెగకుండా వర్షం కురిసింది. దీంతో పంటలు పండుతాయన్న నమ్మకం రైతుల్లో వచ్చింది. బావులు, కుంటలలోకి 50 శాతం నీరువచ్చి చేరింది. మండలంలోని పలు వాగులు పారుతున్నాయి. లోతుగా ఉన్న పంట పొలాలలోకి నీరు వచ్చి చేరింది. కృష్ణాజీవాడి శివారులోని నారాయణరావు అనే రైతుకు చెందిన సోయా పంట నీట మునిగిపోయింది.

లెండి వాగుకు జలకళ

మద్నూర్‌(జుక్కల్‌): గోజేగావ్‌ సమీపంలోని లెండి వాగు జలకళ సంతరించుకుంది. తెలంగాణాతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో సైతం వర్షాలు కురుస్తుండటంతో లెండి వాగులో వరద నీరు పారుతోంది.

ఎన్నో నెలలుగా చుక్క నీరు లేకుండా పూర్తిగా ఎండి పోయిన లెండి వాగు ప్రస్తుతం నీరు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే గోజేగావ్‌ వద్ద ఉన్న లోలెవల్‌ వంతెన నీట మునిగి రాకపోకలు స్తంభిస్తాయని గ్రామస్తులు వాపోయారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఇబ్రహీంపేట్‌లో పర్యటిస్తున్న ఆర్డీవో రాథోడ్‌ రమేశ్‌

బాన్సువాడ రూరల్‌: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని బాన్సువాడ ఆర్డీవో రాథోడ్‌ రమేశ్‌ కోరారు. మంగళవారం ఆయన ఎంపీడీవో బషీరుద్దీన్‌, ఇన్‌చార్జి ఏపీవో గంగాధర్‌లతో కలిసి ఇబ్రహీంపేట్‌ గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

హైవే బ్రిడ్జి కుంగలేదు

- జాయింట్‌ వద్ద గుంతలు.. మరమ్మతులు చేపట్టిన హైవే అథారిటీ సిబ్బంది
- సర్వీస్‌ రోడ్డు మీదుగా వాహనాల మళ్లింపు
- అధికారుల వెల్లడి



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్‌ ఫ్యాక్టరీ వద్ద నేషనల్‌ హైవే బ్రిడ్జి కుంగినట్లు సోషల్‌ మీడియాలో ప్రచారం కావడంతో నిజామాబాద్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపునకు వెళ్లే వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం హైవే అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డును పరిశీలించారు. రోడ్డు కుంగలేదని, ఒక ఇనుప పట్టీ విరిగిందని, దాని పక్కన ఉన్న డాంబార్‌ వర్షపు తాకిడికి లేచి పోయిందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఆ గుంతలోనుంచి వెళితే వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతుల నేపథ్యంలో నాలుగు రోజులు వరకు నిజామాబాద్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపునకు వెళ్తున్న వాహనాలను సర్వీస్‌ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌

- ఉమ్మడి బాల్కొండలో వరుస దొంగతనాలు
- బెంబేలెత్తుతున్న జనాలు



ఇంట్లో చిందరవందరగా పారేసిన వస్తువులు (ఫైల్‌)

బాల్కొండ: ఉమ్మడి బాల్కొండ మండలం(బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా)లో తాళం వేసిన ఇళ్లను దుండగులు టార్గెట్‌ చేస్తూ చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన లింగన్న గత శుక్రవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా దుండగులు పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. 8.5 తులాల బంగారం, 50 వేల నగదు ఎత్తుకెళ్లారు. ముప్కాల్‌ మండల కేంద్రానికి చెందిన లింబాద్రి ఇంటికి తాళం వేసి వెళ్లగా సోమవారం పట్టపగలు ఇంట్లోకి చొరబడిన దుండగులు 9 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అదే రోజున మెండోరా మండలం దూదిగాంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి విఫలయత్నం చేసి పారిపోయినట్లు తెలిసింది. ఇలా రోజుకోచోట చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు మాత్రం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బంగారు ఆభరణాలు, నగదు టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇతర ఏ సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చోరీలకు అడ్డుకట్ట పడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారి పక్క గ్రామాల్లోనే చోరీలు

బాల్కొండ మండలం చిట్టాపూర్‌, ముప్కాల్‌ మండల కేంద్రం, మెండోరా మండలం దూదిగాంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరుగగా, ఈ మూడు గ్రామాలు కూడా జాతీయ రహదారి 44 ఆనుకుని ఉన్నవే కావడం గమనార్హం. దుండగులు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలనే టార్గెట్‌ చేసి చోరీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన రెండు ఏటీఎంలు సైతం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నవే. 2022లో మెండోరా మండలం బుస్సాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో భారీ చోరీ జరగగా, 8 కిలోల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. రెండేళ్లు గడిచినా చోరీకి పాల్పడిన దుండగులందరినీ ఇప్పటి వరకు పట్టుకోలేదు. కొందరిని అరెస్టు చేయగా కొంత మేర బంగారం రికవరీ అయ్యింది.

క్రైం కార్నర్‌

ఏటీఎంలలో భారీ చోరీ..

బాల్కొండ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో గత నెల 4వ తేదీన భారీ చోరీ జరిగింది. కేవలం 9 నిమిషాల వ్యవధిలోనే దుండగులు రూ.25 లక్షల నగదును లూటీచేశారు. ఆ కేసు ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. గతేడాది సెప్టెంబర్‌లో మెండోరా మండలం పోచంపాడ్‌ కూడలి వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నుంచి రూ.12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఆ కేసులో లారీ డ్రైవర్‌ను మాత్రం అరెస్ట్‌ చేసినప్పటికీ దుండగులను పట్టుకోలేదు.

పూడ్చిపెట్టిన మృతదేహం వెలికితీత

- ముగ్గురిని విచారిస్తున్న పోలీసులు
- ఘటనాస్థలానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు



మృతదేహాన్ని వెలికితీయిస్తున్న పోలీసులు

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డికి చెందిన జీర్ల చిన్న మల్లయ్య అనే వ్యక్తి హత్యకు గురికాగా, మృతదేహాన్ని మంగళవారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వెలికి తీశారు. ఘటనా స్థలానికి గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మృతదేహాన్ని బయటకి తీయించి కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. హత్య కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ సంతోష్‌కుమార్‌ తెలిపారు. ఎస్సై రాజు, తహశీల్దార్‌ గంగాసాగర్‌, పోలీస్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

నిజామాబాద్‌రూరల్‌: ఈనెల 11వ తేదీన యాసిడ్‌తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజయ్య అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు. ముబారక్‌నగర్‌ ప్రాంతానికి చెందిన రాజయ్య(46) ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది యాసిడ్‌ తాగాడని, గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారన్నారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాజయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాజశేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సూపర్‌మార్కెట్‌ దగ్ధం



ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌లో ఉన్న శ్రీమార్ట్‌ సూపర్‌ మార్కెట్‌ షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం షాపులో నుంచి మంటలు రావడంతో స్థానికులు ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించగా, ఫైర్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో రెండు ఫైర్‌ ఇంజిన్లు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రూ.70లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని షాపు యజమాని శ్రీవాణి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురు విద్యార్థుల అదృశ్యం

- భిక్కనూరులో ఒకరు.. కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో ముగ్గురి ఆచూకీ లభ్యం
- మండల కేంద్రంలో మూడు గంటల పాటు ఉత్కంఠ



పోలీసులు పట్టుకున్న విద్యార్థులు

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన నలుగురు విద్యార్థులు మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకుండాపోవడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గంధం శశి, బోయిని నరేందర్‌, 9వ తరగతి చదువుతున్న గంధం రామ్‌చరణ్‌, బల్ల యశస్విన్‌ ఉదయం పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి వారి ఇంటి నుంచి వెళ్లారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత తమ బ్యాగులను ఇంటి వద్ద పెట్టి బయటకు వెళ్లారు. తమ పిల్లలు రాత్రి 8 అయినా తమ ఇంటి వద్ద కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు పలుచోట్ల వెతికారు. అయినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నలుగురు విద్యార్థులు మండల కేంద్రంలోని జెండాగల్లీకి చెందిన విద్యార్థులు. తల్లిదండ్రులు పోలీసులు, స్థానికులు పలుచోట్ల వెతకడంతో బల్ల యశస్విన్‌ అనే విద్యార్థి డబుల్‌ బెడ్‌రూంల వద్ద రాత్రి 11 గంటలకు దొరికాడు. యశస్విన్‌ను పోలీసులు విచారించగా శశి, నరేందర్‌, రామ్‌చరన్‌లు భిక్కనూరు రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి కామారెడ్డి వెళ్తున్నామని చెప్పారని తెలిపాడు. దీంతో భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌ వెంటనే ఈ విషయాన్ని కామారెడ్డి పోలీసులకు, రైల్వే పోలీసులకు సమాచారం అందించగా కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న నిజామాబాద్‌ వైపు వెళ్తున్న రైల్‌లో ఈ ముగ్గురు కనిపించారు. దీంతో వీరిని పట్టుకుని భిక్కనూరు పోలీస్‌ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎందుకు రైలులో వెళ్తున్నారని వారిని అడిగితే సమాధానం చెప్పకుండా ఏడుస్తున్నారు.

ఇరువురిపై కేసు నమోదు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన పిట్ల రాజయ్య అనే కూలీ సోమవారం విద్యుత్‌ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మేస్త్రి పులబోయిన శంకర్‌తోపాటు మాజీ సర్పంచ్‌ నల్లపు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుబ్రహ్మణ్య చారి మంగళవారం తెలిపారు. శ్రీనివాస్‌ ఇంటి నిర్మాణ చేపడుతుండగా.. రాజయ్య కూలీ పనికి వెళ్లాడన్నారు. ఇంట్లో ట్యూబ్‌ లైట్‌పాడవడంతో కొత్తది బిగించాలని రాజయ్యకు శ్రీనివాస్‌ సూచించాడని తెలిపారు. రాజయ్య ట్యూబ్‌లైట్‌ బిగిస్తుండగా విద్యుత్‌ షాక్‌ తగిలిందని, బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడన్నారు.

భూమి చదును చేస్తుండగా అడ్డుకున్న వారిపై..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్న పలువురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట ఎస్సై రాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన లింగ మహేందర్‌, రాఘవేందర్‌ 2022లో గోపాల్‌పేటలోని సర్వేనెంబర్‌ 508లో నాలుగుగుంటల భూమిని ప్రవీణ్‌ వద్ద కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమిని చదును చేసేందుకు మహేందర్‌, రాఘవేందర్‌ వారిబంధువులతో కలిసి మంగళవారం గ్రామానికి రాగా అదే గ్రామానికి చెందిన షాహెద్‌పాషా, అతని తమ్ముడు బిలాల్‌తోపాటు అతని తల్లి అడ్డుకున్నట్లు మహేందర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. షాహెద్‌పాషా, బిలాల్‌తోపాటు అతని తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పేకాటస్థావరంపై దాడి

బోధన్‌ రూరల్‌(బోధన్‌): సాలురా మండలంలోని సాలురా క్యాంపులో పేకాటస్థావరంపై మంగళవారం దాడి చేసినట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.1,320 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: పట్టణంలోని టీచర్స్‌ కాలనీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,300 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు మోటార్‌ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

బాల్కొండ: ప్రమాదవశాత్తు బహ్రెయిన్‌లో మృతి చెందిన మెండోరా మండల కేంద్రానికి చెందిన మాకూరి వినోద్‌(35) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. ప్రవాస భారతీయుల హక్కుల కమిటీ అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు, బహ్రెయిన్‌లోని తెలుగు కళా సమితి కన్వీనర్‌ నోముల మురళి, మాకూరి గంగాధర్‌.. వినోద్‌ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు కృషి చేశారని గ్రామస్తులు తెలిపారు. వినోద్‌ అంత్యక్రియలను మంగళవారం గ్రామంలో పూర్తి చేశారు.